# అధికారుల నిర్లక్ష్యం తోనే ఇద్దరు కార్మికులు మృతి

టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



బాధిత కుటుంబాలను ఓదార్చుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూలై 17: అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇద్దరు కార్మికులు చనిపోయారని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి రామగుండం-3 డివిజన్ పరిధిలోని ఓపెన్‌కాస్టు-2 (ఉపరితల గని)లో బుధవారం సాయంత్రం పైపులైన్ లీకేజీ పనులు చేస్తున్న క్రమంలో సైడ్‌వాల్ కూలి ఫిట్టర్ వెంకటేశ్వర్లు (58), జనరల్ మజ్దూర్ కార్మికుడు విద్యాసాగర్ (34) మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాత్రి గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానలో కార్మికుల మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. గడిచిన నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదని వెంకటేశ్వర్లు మంగళవారం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ కారణంగానే పైపులైన్ లీకేజీ పనులు చేస్తున్న కార్మికులపై మట్టి కూలి మృతి చెందాదని ఆవేదన చెందారు. అదృష్టవశాత్తు మరో ఇద్దరు కార్మికులు ప్రాణపాయం నుంచి బయటపడ్డారని చెప్పారు. కార్మికులు తప్పుచేస్తే ఎల్లో, రెడ్‌కార్డులు జారీచేసి చర్యలు తీసుకుంటామని చెబుతున్న యాజమాన్యం, తప్పు చేసిన అధికారులపై ఏలాంటి చర్యలు తీసుకుంటుందో? తెలుపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐఎఫ్‌టీయూ నేత తోకల రమేశ్ మాట్లాడుతూ, రక్షణ చర్యల్లో లోపం కారణంగానే ఇద్దరు కార్మికులు చనిపోయారని ఆరోపించారు. కార్మికుల మృతికి అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం బీమా డబ్బులు చెల్లించి చేతులు దులుపుకోకుండా ₹3 కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశా రు. కార్మికుల మృతిపై ఐఎఫ్‌టీయూ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది.

# భర్త మరణం తట్టుకోలేక..

- మృతదేహం వద్ద కుప్పకూలిన భార్య
- గుండెపోటుతో అక్కడికక్కడే మృతి
- పండుగ పూట వృద్ధ దంపతుల మరణం
- బంజేరుపల్లిలో విషాదం



తోట మల్లయ్య, రాజ్యలక్ష్మి దంపతులు (ఫైల్)

మానకొండూర్, జూలై 17 : మలి వయసులో తోడుగా ఉన్న భర్త అనారోగ్యంతో చనిపోగా, ఆ వృద్ధురాలు తట్టుకోలేకపోయింది. రాత్రి నుంచి గుండెలవిసేలా రోదిస్తూ.. ఉదయం మృతదేహం వద్దే కుప్పకూలిపోయింది. గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోగా, కుటుంబంలో విషాదం నిండింది. ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీరని దుఃఖాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మానకొండూర్ మండలం కొండపల్కల పంచాయతీ పరిధిలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు తోట మల్లయ్య(77) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆయన భార్య రాజ్యలక్ష్మి (70) తట్టుకోలేకపోయింది. చనిపోయిన కాన్నుంచి గుండెలవిసేలా రోదించింది. బుధవారం ఉదయం మల్లయ్య దహనసంస్కారాలు చేయడానికి కుటుంబ సభ్యులు సిద్ధమవుతుండగా.. మల్లయ్య మృతదేహం వద్ద రాజ్యలక్ష్మి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. చికిత్స కోసం తరలించడానికి 108కు సమాచారం ఇవ్వగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. సిబ్బంది వచ్చి పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్టు తెలిపారు. తొలిఏకాదశి పండుగ పూట వృద్ధ దంపతులు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొన్నది. మధ్యాహ్నం మల్లయ్య, రాజ్యలక్ష్మి దంపతులకు అంత్యక్రియలు ఒకేసారి నిర్వహించారు. ఆ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

# మెరుగైన వైద్య సేవలందించాలి

- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష




ఫార్మసిస్ట్ సురేశ్‌ను వివరాలు అడుగుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి టౌన్, జులై 17: దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులు, సిబ్బందిని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా దవాఖానను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణలో లోపాలున్నాయని, పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్‌పై ఆగ్రహించారు. అలసత్యం వహించిన కాంట్రాక్టర్‌కు వెంటనే మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఫార్మసీలో ఎలాంటి మందులు ఇస్తున్నారు? అనే విషయాలను ఫార్మసిస్ట్ సురేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దవాఖానలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, డ్రైనేజీలో ఏదైనా సమస్య ఉంటే తక్షణమే సంబంధిత ఇంజినీర్లకు తెలిపి మరమ్మతులు చేయుంచుకోవాలన్నారు. బ్లడ్ బ్యాంక్, ఫార్మసీ, కంటి, దంత, మరుగుదొడ్లు, వార్డులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలకు సరిపడా టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలని, ఇబ్బందులుంటే ప్రణాళిక తయారు చేసి కార్యాలయానికి అందజేయాలన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు

పెద్దపల్లి రూరల్, జూలై 17: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బాలింత కొమిర రమ్య రెండు రోజుల క్రితం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. అంగన్‌వాడీ టీచర్ కోడిగుడ్లను ఇవ్వడంతో ఇంటికి తెచ్చుకున్నది. బుధవారం వాటిని తిందామని ఉడికించే సరికి అవి కుళ్లిపోయి వాసన రావడంతో రమ్య కంగుతిన్నది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలుపడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. పోషకాహారం అని చెప్పి.. ఇలా చెడిపోయిన గుడ్లు ఇస్తారా? అని ప్రశ్నించారు. మురిగిన కోడిగుడ్లను చూపిస్తూ తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా అయింది.





కుళ్లిన కోడిగుడ్లను చూపుతున్న రమ్య మామ కొమిర మొండయ్య





# కొంత మందికే రుణమాఫీ?

పీఎం కిసాన్ సమ్మాన్ నిబంధనలతో దగా

## కాంగ్రెస్ సర్కారు సవాలక్ష కొర్రీలు

- 2014లో 3,84,106 మంది కర్షకులకు బీఆర్ఎస్ ప్రభుత్వం వర్తింపు
- స్వరాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య
- నాలుగు జిల్లాల్లో 7,11,575మంది అన్నదాతలు ఉన్నట్టు రైతు భరోసాలో తేల్చిన ప్రస్తుత ప్రభుత్వం
- మొదటి విడత రుణమాఫీ 1,29,178 మందికే
- మొత్తం అర్హుల జాబితాబయట పెట్టేందుకు జంకుతున్న అధికారులు
- నేడు లక్షలోగా రైతులకు రుణమాఫీ
- రైతు వేదికల్లో సీఎం ప్రసంగం వినేలా ఏర్పాట్లు

**తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ₹2లక్షల రుణమాఫీ చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్, ఇప్పుడు మాఫీపై సవాలక్ష కొర్రీలు పెడుతున్నది. ప్రభుత్వ నిబంధనలు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని చూస్తే.. ఉమ్మడి జిల్లాలో నలభై శాతం రైతులకు కూడా రుణమాఫీ వర్తిస్తుందా..? లేదా..? అన్నది అనుమానంగానే కనిపిస్తున్నది. నిజానికి 2014లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 3.84లక్షల పై చిలుకు రైతులకు రుణమాఫీ వర్తింప జేసింది. కేసీఆర్ సర్కారు వ్యవసాయరంగంపై చూపిన శ్రద్ధతో గడిచిన పదేళ్లలో సాగు విస్తీర్ణంతోపాటు సాగు చేసే రైతుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ లెక్కన కొంత అటు ఇటుగా ఆరు నుంచి ఏడు లక్షలకుపైగా కర్షకులకు ప్రస్తుతం రుణమాఫీ వర్తించాల్సి ఉండగా.. ప్రస్తుతం సర్కారు నిబంధనలతో రెండు నుంచి మూడు లక్షల మందికి మాత్రమే లబ్ధిచేకూరే అవకాశం కనిపిస్తున్నది. మరోవైపు మూడు విడుతల్లో రుణమాఫీ చేస్తామని చెబుతుండగా.. మొదటి విడుత గురువారం లక్ష వరకు ఉన్న 1,29,178 మంది ఖాతాల్లో డబ్బులు జమవుతున్నట్టు యంత్రాంగం అధికారికంగా ప్రకటించింది. నిజానికి లక్ష లోపు బ్యాంకు రుణం తీసుకున్న చాలా మంది పేర్లు మొదటి విడుత జాబితాలో లేవని తెలుస్తుండగా.. పాస్‌బుక్ కాకుండా ఆహారభద్రత కార్డు ఆధారంగా లిస్ట్ తయారు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

కరీంనగర్, జూలై 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ సర్కారు 2014లోనే రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆనాడు ఉమ్మడి జిల్లాలో 4,48,634 మంది రైతులకు ₹2,221 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్టుగా ముందుగా బ్యాంకర్లు ప్రకటించారు. వీటితోపాటు బంగారం కుదువ పెట్టుకొని (గోల్డ్ రుణాల పేరిట) 28,083 మంది రైతులకు ₹284 కోట్లు ఇచ్చినట్టు లెక్కలు తేల్చారు. మొత్తంగా 2014 మార్చి 31 నాటికి 4,76,717 మంది రైతులకు ₹2,505 కోట్ల వ్యవసాయరుణాలు ఇచ్చినట్టు స్పష్టం చేశారు. అధికారులు ఇచ్చిన నివేదికలో పలు తప్పులు జరిగాయని, అనర్హులకు సైతం రుణమాఫీ చేస్తున్నారనే ఫిర్యాదులు క్షేత్రస్థాయి నుంచి రావడంతో అధికారులు రంగంలోకి నిగ్గు తేల్చారు. ఆ ప్రకారం ఆనాడు ఉమ్మడి జిల్లాలో 3,84,106 మంది రైతులు రుణమాఫీకి అర్హులని, వీరు తీసుకున్న మొత్తం ₹1683 కోట్లుగా నిర్ధారించింది. బ్యాంకర్లు, అధికారులు నిగ్గు తేల్చిన తర్వాత ఆనాడు ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేసింది.

### పెరిగిన రైతులు, సాగు విస్తీర్ణం

2014లో కేసీఆర్ సర్కారు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2014లో ఉమ్మడి జిల్లాలో అన్ని పంటలు కలిపి 11,79,013 ఎకరాల్లో సాగుచేస్తే.. 2019 నాటికి అది 22,41,066 ఎకరాలకు చేరింది. అంటే 10,62,053 ఎకరాల్లో సాగు పెరిగింది. 2014లో వరి సాగు 3,63,776 ఎకరాల్లో ఉంటే 2019 నాటికి అది 12,35,223 ఎకరాలకు చేరింది. అంటే 8,71,447 ఎకరాల్లో విస్తీర్ణం పెరిగింది. ఇదంతా కాళేశ్వరం జలాలు రావడంతోనే సాధ్యమైంది. 2014లో ఆనాడు వ్యవసాయం చేసిన రైతుల సంఖ్య ఐదు లక్షల వరకు ఉండగా, 2019 నాటికి ఆ సంఖ్య 9,25,343కు చేరింది. అంటే దాదాపు నాలుగు లక్షల వరకు రైతుల సంఖ్య పెరిగింది. ప్రాజెక్టులు పూర్తి చేయడం. చెక్ డ్యాంలు నిర్మించడం, ఇదే సమయంలో మిషన్‌కాకతీయ కింద చెరువులు పునరుద్ధరించడం, వరద కాలువ నిండుగా మారడం, మధ్యమానేరు, లోయర్ మానేరు డ్యాంలతోపాటు అనుసంధాన ప్రాజెక్టుల్లో 365 రోజులు నిండుకుండలా నీళ్లుండడం, భూగర్భజలాల ఉబికిరావడం, ఫలితంగా ఈ సాగు విస్తీర్ణం పెరగడం సాధ్యమైంది. అంతేకాదు, తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల వల్ల సిరిసిల్ల వంటి మెట్ట ప్రాంతాల్లో అనుహ్యాంగా పెరిగిన భూగర్భజలాలు.. ఐఏఎస్‌లకే ఒక పాఠ్యాంశంగా మారాయంటే సాగునీటి రంగంలో ఏమేరకు మార్పులు జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

### నిబంధనలతో కొర్రీలు

తాము అధికారంలోకి రాగానే రైతులకు ₹2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ.. వరంగల్ డిక్లరేషన్‌లో స్పష్టం చేసింది. ఇంకా అభయహస్తం పేరిట ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రైతు భరోసా కింద ₹15వేలు, వ్యవసాయ కూలీలకు ₹12వేలు, వరి క్వింటాలకు ₹500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. అందులో ఏ ఒక్క హామీ ఇప్పటి వరకు అమలుకు నోచలేదు. ఈ నేపథ్యంలో రుణమాఫీ అయినా అందరికీ వర్తింపజేస్తారా..? లేదా..? అన్నదానిపై అనేక సందేహాలు తెరపైకి వస్తున్నాయి. పంట రుణ మాఫీ పథకం -2024 అమలుకు ఇచ్చిన నిబంధనల్లో.. పీఎం కిసాన్ మినహాయింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వద్ద డేటా ఉన్నంత మేరకు ఆచరణాత్మకంగా అమలు కోసం పరిగణలోకి తీసుకుంటామని అందులో పేర్కొన్నది. ఈ నిబంధన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ప్రామాణికంగా తీసుకుంటారన్న అంశంపై మెజార్టీ రైతుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతున్నది. నిజానికి పీఎం కిసాన్ అమలుకు రాష్ట్రంలో రైతు భరోసా (రైతు బంధు) అమలుకు చాలా వ్యత్యాసం ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, కేంద్ర పథకాలకు లింకు పెట్టడం ఏమాత్రం సముచితం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిబంధనలు అమలు చేస్తే లక్షలాది మంది రైతులకు రుణ మాఫీ వర్తించకుండా పోయే ప్రమాదమున్నది. ప్రధానంగా రైతు కుటుంబాల్లో ఉన్నత చదువులు చదివే పిల్లలు బ్యాంకు రుణం పొందాలంటే.. తన తండ్రి పేరిట ఐటీ కచ్చితంగా చూపించాల్సి ఉంటుంది. విదేశాలకు వెళ్లాలన్నా ఐటీ రిటర్న్స్ ఉండి తీరాలి. నిజానికి వీరంతా ఐటీ చెల్లింపులు చేయాలన్న ఉద్దేశంతో ఉన్న వారు కారు. పిల్లల అవసరాల దృష్ట్యా ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్న వారే. పీఎం కిసాన్ కింద ఐటీ చెల్లింపులు ఉన్న వారికి సమ్మాన్ నిధి వర్తింపులేదు. ఇదే నిబంధనను రైతులకు పెడితే రుణమాఫీ వర్తించకుండా పోయే ముప్పు ఉన్నది.

### నేడు 1,29,178 మందికి వర్తింపు

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం పూటకోమాట మాట్లాడుతున్నది. ముందుగా ఆహార భద్రతకార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తామంటూ నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నది. దీనిపై బీఆర్ఎస్ ఎండగట్టడం, ఇదే సమయంలో రైతుల నుంచి విమర్శలు రావడంతో రేషన్‌కార్డుతోపాటు పాస్‌బుక్‌ను పరిగణలోకి తీసుకుంటామని ప్రకటించింది. దీంతోపాటు మొత్తం రుణమాఫీని ఆగస్టు నెలాఖరులోగా వర్తింప జేస్తామంటూ బుధవారం సాయత్రం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందులో భాగంగా ₹లక్ష వరకు రుణం తీసుకున్న వారికి గురువారం చెల్లింపులు జరుగుతాయని, ₹1.50 లక్షల రుణం అన్నదాతలకు ఈ నెలాఖరులోగా, ₹2 లక్షల వరకు అప్పు తీసుకున్న వారికి ఆగస్టు నెలాఖరులోగా రుణమాఫీ చేస్తామని చెప్పారు. అందులో భాగంగానే మొదటి విడుత అంటే.. లక్ష వరకు రుణం తీసుకున్న రైతులకు గురువారం సాయత్రంలోగా రుణమాఫీ వర్తింపజేస్తున్నట్టు ప్రకటించారు. ఆ ప్రకారం చూస్తే.. సిరిసిల్లలో 23,779 మందికి, కరీంనగర్‌లో 36,872, జగిత్యాలలో 39,253, పెద్దపల్లిలో 29,274 మొత్తం ఉమ్మడి జిల్లాలో 1,29,178 మందికి వర్తిస్తున్నట్టు ఆయా జిల్లాల యంత్రాగం ప్రకటించింది. నిజానికి ఇటీవల ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ఉమ్మడి జిల్లాలో 7,11,575 మందికి వర్తింప జేసింది. ఈ లెక్కన చూస్తే.. లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల సంఖ్య దాదాపు రెండున్నర లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నా.. ప్రస్తుతం 1.29 లక్షల పైచిలుకు మందికి మాత్రమే మాఫీ వర్తింపజేస్తున్నది. అంటే కేవలం ఆహారభద్రత కార్డు ఆధారంగానే ఈ జాబితా తయారు చేశారని, పాస్‌బుక్‌ను పరిగణలోకి తీసుకోలేదని, ఫలితంగా వేలాది మంది రైతులకు అన్యాయం జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి. ఈ లెక్కన చూస్తే మొత్తం మూడు విడుతల్లో కలిపి కూడా రెండు నుంచి రెండున్నర లక్షల మంది రైతులకు మించి రుణ మాఫీ జరిగే అవకాశం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు.. నిజానికి రెండు లక్షల వరకు రుణమాఫీ వర్తింపు జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి అధికార యంత్రాగం పంపింది. వాటిని మాత్రం అధికారులు బయట పెట్టడం లేదు. పెడితే రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వెల్లువెత్తే అవకాశముందని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇది ఇలా ఉండగా మొదటి విడుత కింద సైతం చాలా మంది రైతుల పేర్లు జాబితాలో రాలేదని తెలుస్తుండగా, సదరు రైతులు ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం అందుతున్నది. మరోవైపు రుణమాఫీ ప్రక్రియను విస్తృత ప్రచారం చేసుకునేందుకు ముఖ్యమంత్రి రైతు వేదికలను వినియోగించుకుంటున్నారు. అందులో భాగంగానే గురువారం సాయత్రం సీఎం రైతు వేదికల్లో రైతులతో ప్రసంగిస్తారని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 57. జగిత్యాలలో 71, పెద్దపల్లిలో 54, కరీంనగర్‌లో 75 రైతు వేదికల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఎంపిక చేసిన రైతులను మాత్రమే రైతు వేదికలకు ఆహ్వానించినట్టు తెలుస్తున్నది.

**మొదటి విడుత కింద లక్షలోపు రుణమాఫీకి సంబంధించిన రైతు వివరాలు**

| జిల్లా | రుణమాఫీ వర్తించే రైతుల సంఖ్య |
|---|---|
| రాజన్నసిరిసిల్ల | 23,779 |
| కరీంనగర్ | 36,872 |
| జగిత్యాల | 39,253 |
| పెద్దపల్లి | 29,274 |

# ఎములాడలో తొలి ఏకాదశి సందడి



భక్తిసంగీతం ఆలపిస్తున్న రేవతి, అనిత బృందం

వేములవాడ టౌన్, జూలై 17: వేములవాడ రాజన్న ఆలయంలో తొలి ఏకాదశి పండుగ అంబరాన్నంటింది. ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం నాగిరెడ్డి మండపంలో అఖండభజన కనులపండువలా జరిగింది. వంద మంది కళాకారులతో బుధవారం ఉదయం 6 గంటలకు ప్రారంభించిన భజన, గురువారం ఉదయం వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. అలాగే పలువురు కళాకారులు భక్తి సంగీతంతో అలరించారు. కళాకారులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు. నమిలకొండ అనిత, ప్రతాప శ్రీముఖి, రక్షిత, కరీంనగర్‌కు చెందిన రేవతి బృందం, లత బృందం ఆలపించిన భక్తి సంగీతం శ్రోతలను ఆనందపరవశుల్ని చేసింది. కార్యక్రమంలో ఆలయ సాంస్కృతిక కార్యక్రమాల విశ్రాంత ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్య శర్మ, మధు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 'రైతు భరోసా'పై రేపు అభిప్రాయ సేకరణ

కరీంనగర్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : రైతు భరోసా అమలుకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని వేసిన విషయం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీ శుక్రవారం కరీంనగర్‌కు రానున్నది. బొమ్మకల్ బైపాస్‌లోని వీ కన్వెక్షన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి ఈ కమిటీ సభ్యులైన మంత్రు లు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ వర్క్‌షాప్ ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించనున్నారు.

# పెద్దపల్లి లైబ్రరీకి.. నిర్లక్ష్యపు చెద

- శిథిలావస్థలో భవనం.. వానొస్తే ఉరుసుడే
- కుర్చీల కొరత.. పుస్తకాలు అరకొరే
- ఇబ్బందుల్లో నిరుద్యోగులు
- నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి



పెద్దపల్లి, జూలై17: పెద్దపల్లి జిల్లా కేంద్ర గ్రంథాలయం అధ్వానంగా మారింది. భవనం శిథిలావస్థకు చేరి భయపెడుతున్నది. పెద్దపల్లి చుట్టు పక్కల గ్రామాల నుంచి నిత్యం 100 మందికిపైగా వస్తూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నారు. ఒకప్పుడు పర్మినెంట్ భవనంలో రెండు గదులతో నడిచిన లైబ్రరీ ఇరుగ్గా మారడంతో కొత్త భవనం నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆ పాత భవనాన్ని పెద్దపల్లి మున్సిపల్‌కు అప్పగించారు. కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శంకుస్థాపన కూడా చేశారు. అయితే విద్యార్థి సంఘాల వ్యతిరేకతతో నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం పెద్దపల్లి పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలోని పాత దూరదర్శన్ భవనంలో కొనసాగుతున్న లైబ్రరీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. కనీస మౌలిక వసతులు లేవు. టాయ్‌లెట్లు కూడా లేవు. పుస్తకాలు, కుర్చీల కొరత వేధిస్తున్నది. ఇరుకు గదులు, భవనం శిథిలావస్థకు చేరడంతో వానొస్తే చాలు స్లాబ్ ఊరుస్తున్నదని, గొడలు తడిసి చెడు వాసన వస్తున్నదని, భవనం చుట్టూ వర్షం నీరు చేరుతుండడంతో లోపలికి రాలేకపోతున్నామని పాఠకులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వసతులు కల్పించాలని, వీలైనంత త్వరగా నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.



### మరో భవనంలోకి మార్చాలి

జిల్లా గ్రంథాలయంలో కనీస వసతులు లేవు. ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా కనిపిస్తున్నది. వానొస్తే భవనం చుట్టూ నీరు చేరి రాకపోకలకు ఇబ్బందైతున్నది. గోడలు చెమ్మపట్టి బ్యాడ్ స్మెల్ వస్తున్నది. చాలా ఇబ్బంది అయితున్నది. ప్రిపేర్ కాలేకపోతున్నం. వీలైనంత త్వరగా గ్రంథాలయాన్ని అన్ని వసతులున్న వేరే భవనంలోకి మార్చాలి.

**- ఎస్ సతీశ్, గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి (పెద్దపల్లి)**



### వాష్ రూమ్‌లు లేవు

మేం రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లైబ్రరీలోనే ప్రిపేరవుతున్నం. ఇక్కడ సరిపడా కుర్చీలు లేవు. ఫ్యాన్లు లేవు. వాష్ రూమ్, టాయ్‌లెట్స్ కూడా అందుబాటులో లేవు. దోమలు కుడుతున్నాయి. చదువుకోలేకపోతున్నాం. లైబరీలో కనీస మౌళిక వసతులు కల్పించాలి.

**-బీ ప్రియాంక, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి (పెద్దపల్లి)**

# నేడు డీఎస్సీ పరీక్ష

కమాన్ చౌరస్తా, జూలై 17 : డీఎస్సీ 2024 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎగ్జామ్స్ ఉండనుండగా, అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్ణీత సమయానికి గంటన్నర ముందు నుంచి లోపలికి అనుమతిస్తారని, 10 నిమిషాల ముందు గేట్లు మూసి వేస్తారని చెబుతున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు, బాల్ పాయింట్ పెన్ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు కేటాయించారు. అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల, వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల, వివేకానంద డిగ్రీ, పీపీ కళాశాల, వాగేశ్వరి ఐఓఎన్ డిజిటల్ జోన్ ఎల్ఎండీ కాలనీ, సింగపూర్‌లోని కమలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో సెంటర్లు ఏర్పాటు చేశారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571